క్లుప్తంగా

ట్యాంకులు శుభ్రం చేయక పోతే చర్యలు



మల్లికార్జునయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ

ఆలూరు: ఎస్ఎస్ ట్యాంకులను వారానికి ఒకసారి బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ మల్లికార్జునయ్య వాటర్‌మెన్లను ఆదేశించారు. ఆదివారం ఆయన హాలహర్వి మండలంలోని చింతకుంట, బాపురం తదితర గ్రామాల్లోని నీటి పథకాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఫిల్టర్ బెడ్లలో చెత్త, చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందికి సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఎస్ఎస్ ట్యాంకులు, జీఎస్ఆర్ ట్యాంకులను శుభ్రం చేసిన తేదీలను నమోదు చేయాలన్నారు. ఆలూరు, మొలగవెల్లి, జోహారపురం, చింతకుంట, హొళగుంద, హాలహర్వి, చిప్పగిరి ,గూళ్యం గ్రామస్తులకు తాగునీటి సమస్య రానివ్వకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

దేవాలయాల్లో అన్యమతస్తులను తొలగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

మద్దికెర : హిందూ దేవాలయాల్లో అన్యమతస్తులను తొలగించాలని ఆర్ఎస్ఎస్ రాష్ట్రీయ కార్యనిర్వాహక అధికారి మేకపాటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్రీయ హిందూ పరిషత్ కార్యనిర్వాహక అధికారి వీరరాజు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక డీపీఏపీ కల్యాణ మండపంలో హైందవ శంఖారావం సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ దేవాలయాల్లో పూజాకైంకర్యాలన్నీ భక్తి శ్రద్ధలతో నిర్వహించాలని, ఉల్లంఘనకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. హిందూ సమాజంపై, ఆలయాలపై ఉన్మాదంతో దాడులు చేస్తున్న వారిని శిక్షించాలన్నారు. దేవాలయాల భూముల్లో అన్య మతస్తుల అక్రమ కట్టడాలను కూల్చివేయాలన్నారు. ప్రవచనకర్త సూర్యనందస్వామి, స్థానికులు వెంకట్‌మాధవ్ పాల్గొన్నారు.

కోలుకోలేక యువకుడి మృతి



బోయ ఉలిగేష్ (ఫైల్)

హొళగుంద: మండల కేంద్రం బీసీ కాలనీకి చెందిన బోయ ఉలిగేష్(25) బళ్లారి పెద్దాసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం కోలుకోలేక మృతి చెందాడు. వారం రోజుల క్రితం మొదటి కాన్పు కోసం బళ్లారి ఆస్పత్రిలో ఉన్న భార్య నాగలక్ష్మిని చూసి తిరిగి తన పెద్దమ్మతో కలిసి వస్తుండగా..మోకా వద్ద జరిగిన బైక్ ప్రమాదంలో ఉలిగేష్ తీవ్రంగా గాయపడగా.. అతని పెద్దమ్మకు కాళ్లు విరిగాయి. స్థానికులు ఇద్దరినీ చికిత్స నిమిత్తం బళ్లారి ఓపీడీకి తరలించారు. అక్కడ ఉలిగేష్ చికిత్స పొందుతూ ఆదివారం కోలుకోలేక మృతి చెందాడురు. మృతుడికి రెండేళ్ల క్రితం పెళ్లవగ ప్రమాదం రోజే భార్య మగ బిడ్డను ప్రసవించగా..పురిటిలోనే బిడ్డ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

రేషన్ వేయడం లేదు సార్!



హొళగుందలో సమస్యను వివరిస్తున్న బుడగ జంగాల కులస్తులు

హొళగుంద: తమకు రేషన్ సక్రమంగా వేయడం లేదని మండల కేంద్రానికి చెందిన బుడగ జంగాల కులస్తులు వాపోయారు. ఆదివారం డొక్క రామాంజని, రామ, భీమక్క, నరసమ్మ తదితరులు మాట్లాడుతూ కొద్ది రోజులుగా నిత్యావసర సరుకుల పంపిణీ చేయకపోవడంతో రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డీలర్ల దగ్గరకు వెళ్తే వారు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని వాపోయారు. నిరుపేదలైన తాము ప్రభుత్వం ఇచ్చే బియ్యం, ఇతర సరుకులతో కాలం వెళ్లదీస్తున్నామని సక్రమంగా వేయకపోవడంతో ఆకలితో ఇబ్బందులు పడుతున్నామని కన్నీరు పెట్టుకున్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు.

విద్యార్థులకు చెస్ పోటీలు




మాట్లాడుతున్న చెస్ అకాడమీ సభ్యులు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని నేషనల్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో స్పార్క్ చెస్ అకాడమీ, సాయిజ్యోతి నేత్రదానం ఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సభ్యులు గోపాల్‌రెడ్డి, కొల్లి శ్రీధర్, జంబులయ్య సహకారంతో ఆదివారం చెస్ టోర్నమెంట్ నిర్వహించారు. పోటీల్లో 115 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతలకు రూ.10 వేలు నగదు, మెమోంటోస్, మెడల్స్ అందజేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో చెస్ అకాడమీ సభ్యులు నందకిశోర్, స్వాతి, ఎస్టీయూ యూనియన్ రాష్ట్ర నాయకులు నాగరాజు, మహాదేవప్ప, ఐ ఫౌండేషన్ సభ్యులు విశ్వనాథ్, శివ, పీఈటీ పాల్గొన్నారు.

‘సురక్ష బీమా’తో ఆర్థిక భరోసా

- బీమా పాలసీని ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం
- బ్యాంకు ఖాతా ఉంటే చాలు
- ప్రీమియం ఏడాదికి రూ.20 మాత్రమే



తుగ్గలి : కేంద్ర ప్రభుత్వం పలు బీమా పథకాలను అమలు చేస్తుంది. వాటిలో ప్రధాన్‌మంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై) ఒకటి. ఇది యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ పాలసీ. అంటే పాలసీదారుడు మరణిస్తే..వారి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పిస్తుంది. 18–70 ఏళ్ల మధ్య వయస్సు వారు ఈ పథకంలో చేరేందుకు అర్హులు.

మే నెలలో ఖాతా నుంచి డెబిట్..

పీఎం సురక్ష బీమా యోజనలో చేరాలనుకునే వారికి బ్యాంకు ఖాతా తప్పనిసరిగా ఉండాలి. ఖాతాదారులు నేరుగా బ్యాంకు అధికారులను కలిసి ఈ పథకం వివరాలు తెలుసుకోవచ్చు. ఈ బీమా పథకంలో చేరాలనుకునే వారు ఆటో డెబిట్ ఫెసిలిటీ యాక్టివేట్ చేసుకోవాలి. ఇలా చేసుకుంటే ఖాతాదారుడి బ్యాంకు అకౌంట్ నుంచి ప్రతి సంవత్సరం మేనెల చివరిలో రూ.20 నేరుగా కట్ అవుతాయి. అందువల్ల ఖాతాదారుడు ఆ నెలలో అకౌంట్‌లో మినిమం బ్యాలెన్స్‌తో పాటు రూ.20 కచ్చితంగా ఉండాలి.

పథకం ప్రయోజనాలు..

- ప్రమదావశాత్తు మరణం, వైకల్యానికి సంబంధించి బీమా అందించే పథకం.
- గుండె పోటు, సహజ మరణాలకు ఈ పథకం వర్తించదు.
- ప్రమాదవశాత్తు మరణించినా, పూర్తి వైకల్యం పొందినా రూ.2లక్షలు, పాక్షిక వైకల్యానికి రూ.లక్ష నామినీకి అందిస్తారు.

అర్హులు..

- 18నుంచి 70 ఏళ్ల వయస్సు కలిగి ఉండాలి.
- బ్యాంకు అకౌంట్ ఉన్న వారు సులభంగా ఈ పథకంలో చేరొచ్చు.
- నేరుగా బ్యాంకుకు వెళ్లి అక్కడి సిబ్బందితో మాట్లాడితే సరిపోతుంది.
- ప్రీమియం కట్ చేసుకుని పాలసీ అందిస్తారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



బీమా పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. పీఎంఎస్‌బీవై, పీఎంజేజీవై పథకాలపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. నిరుపేదలకు ఈ పథకం చాలా ఉపయోగకరం. ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తుంది. అలాగే.. పూర్తి అంగవైకల్యం కలిగినా ఒప్పందం మొత్తం చెల్లిస్తారు.

– కేసీ లోకేష్, ఏపీజీబీ బ్యాంకు మేనేజర్, జొన్నగిరి

అవసరమైన ధ్రువ పత్రాలు..

- గుర్తింపు కోసం ఆధార్ కార్డు
- సెల్ నంబర్ → నామినీ వివరాలు
- బ్యాంక్ ఖాతా వివరాలు
- అలాగే పీఎంజేజేవై (ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన) పథకాన్ని కేంద్రం ప్రవేశపెట్టింది. ఈ పథకం రూ.436 వార్షిక ప్రీమియంతో అన్ని రకాల మరణాలకు కవర్ చేస్తుంది. 18–50 ఏళ్ల మధ్య వారు ఈ బీమా పొందవచ్చు. ఈ బీమా పథకం కింద అన్ని బ్యాంకులు, తపాలా కార్యాలయాల నుంచి తీసుకోవచ్చు.

ఓటరు నమోదుకు 220 దరఖాస్తులు



హోసూరులో ఓటు దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్ రమేష్



ఎరుకలచెరువులో ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్

పత్తికొండ(తుగ్గలి) : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్పెషల్ సమ్మరీ రివిజన్–2025లో భాగంగా నియోజకవర్గంలో రెండు రోజులుగా నిర్వహించిన ప్రత్యేక క్యాంపెయిన్‌లో ఓటు నమోదుకు 220 దరఖాస్తులు వచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా కొత్తగా ఓటు నమోదుకు 220 దరఖాస్తులు రాగా, తొలగింపునకు 75, సవరణలకు 106 దరఖాస్తులు వచ్చాయి. ఆదివారం పత్తికొండ తహసీల్దార్ రమేష్ హోసూరులో పోలింగ్ బూత్‌ను తనిఖీ చేసి ఓటరు దరఖాస్తులు పరిశీలించారు. సీనియర్ అసిస్టెంట్ వీరేష్ ఉన్నారు.

మద్దికెర : 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలనే ఉద్దేశంతో చేపట్టిన ప్రత్యేక శిబిరాలకు 23 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ హుసేన్‌సాహెబ్ తెలిపారు. ఆదివారం ఓటరు నమోదు క్యాంపులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 23, 24వ తేదీల్లో కూడా ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తామని చెప్పారు.వీఆర్వోలు పక్కీరప్ప, రంగస్వామి, స్వర్ణమ్మ పాల్గొన్నారు.

కృష్ణగిరి: ప్రత్యేక ఓటరు నమోదుకు 46 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని పోతుగల్లు, ఆగవేలి, ఎరుకలచెరువు పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ఓటరు నమోదును ఆదివారం ఆయన పరిశీలించారు. శని, ఆదివారాల్లో నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో ఫారం–6 కింద 46, ఫారం–7 కింద 4, ఫారం–8 కింద 29 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ నెల 23, 24 తేదీల్లో మరోమారు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తామని 18 ఏళ్లు నిండిన వారంతా ఓటర్‌గా నమోదు చేసుకోవాలని కోరారు.

దేవరగట్టులో కార్తీక మాస పూజలు



ప్రత్యేక అలంకరణలో.., కూర్మావతారంలో మాళ మల్లేశ్వరుడు

హొళగుంద: దేవరగట్టులో ఆదివారం కార్తీక మాసం రెండవ వారంలో భాగంగా మాళ మల్లేశ్వరస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు జరిగాయి. సుప్రభాత సేవ, అభిషేకాలు, రుద్రాభిషేకలు, బండారార్చన, పుష్పార్చన, మహామంగళ హారతి, ఆకుపూజ, నివేదన, నిరాజనం తదితర పూజలు జరిపించి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా స్వామి మూలవిరాట్‌లను విశేషంగా అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

కనీస మద్దతు ధర చట్టం తీసుకురావాలి



మాట్లాడుతున్న పిరామచంద్రయ్య

పత్తికొండ(తుగ్గలి) : రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర చట్టం తీసుకురావాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పి.రామచంద్రయ్య డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో చదువులరామయ్య భవన్‌లో ఏపీ రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు పెద్ద ఈరన్న అధ్యక్షతన జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. రామచంద్రయ్య మాట్లాడుతూ.. రైతుల సమస్యలు పెరిగిపోతున్నాయన్నారు. కష్టపడి పండించిన పంటలకు మద్దతు ధర కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు కావడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ, కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు పూనుకుంటున్నాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతులకు ఖాతాలకు పెట్టుబడి సాయం రూ.20వేలు జమ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం నియోజకవర్గ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా ఉమాపతి, ఉపాధ్యక్షులుగా రామనాయుడు, నాగిరెడ్డి, పెద్దముని, ప్రధాన కార్యదర్శిగా సురేంద్రకుమార్, సహాయ కార్యదర్శులుగా సిద్దలింగప్ప, కాశీ విశ్వనాథ్, హనుమన్న, గౌరవ అధ్యక్షుడిగా కారన్న, కోశాధికారిగా మద్దిలేటి ఎంపికయ్యారు. జిల్లా సహాయ కార్యదర్శి రాజీ సాహెబ్, నియోజకవర్గ అధ్యక్షుడు నాగేంద్రయ్య, కార్యదర్శి ఉమాపతి పాల్గొన్నారు.

24న వనభోజనం

ఆలూరు: స్థానిక గ్రామ చెరువు సమీపంలో ఉన్న శ్రీ జలకంఠేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఈనెల 24వ తేదీన నియోజకవర్గ వాల్మీకి కులస్తుల సేవా సమితి, శివమాలధారుల సంఘం కమిటీ ఆధ్వర్యంలో కార్తీక వన భోజనం కార్యక్రమం నిర్వహిస్తామని శివ మాలధారులు ఆదివారం తెలిపారు. వాల్మీకులు హాజరు కావాలని కోరారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

ఆస్పరి: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఎం మండల కార్యదర్శి హనుమంతు, కార్యవర్గ సభ్యుడు బాలకృష్ణ విమర్శించారు. ఆదివారం మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రజాపోరు పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం అంబేడ్కర్ సర్కిల్, బస్టాండ్ ప్రాంతాల్లో పర్యటించి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని, ప్రజలు పోరాటాలకు సిద్ధంగా కావాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈనెల 14వ తేదీన స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. నాయకులు రామాంజనేయులు, ఈరన్న, చిన్న ఈరన్న పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరుబాట

తుగ్గలి : ప్రజా సమస్యల పరిష్కారానికి ఈనెల 14వ తేదీన సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రజాపోరు ఉద్యమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి శ్రీరాములు కోరారు. ఆదివారం జొన్నగిరిలో ప్రజాపోరు కరపత్రాలను ఆవిష్కరించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా, అధిక ధరలు, నిరుద్యోగం, విద్యుత్ ట్రూ అప్ చార్జీలు పెంచి కూటమి ప్రభుత్వం ప్రజలపై భారం మోపిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజా సమస్యలు పట్టడం లేదన్నారు. హామీల అమలు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేపట్టే ప్రజాపోరు ఉద్యమంలో ప్రజలు భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

మద్దికెర : కంది, పప్పుశనగ పంటలు తెగుళ్ల బారిన పడకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటలను కాపాడుకోవాలని ఏఓ రవి ఆదివారం తెలిపారు. కంది పంటలో పూతలో పురుగు, గూడులో పురుగు నివారణకు ఎమామెక్టిన్ బెంజోయేట్,లెపునూరాస్ ఎవిసెంట్ ఎకరానికి 24 గ్రాములు లేదా కారాజన్ ఎకరానికి 60 మిల్లీగ్రాములు పిచికారీ చేయాలని చెప్పారు. శనగ పైరుకు వడల తెగులు సోకితే మొక్కలు అక్కడక్కడా చనిపోతాయని, నివారణకు సాఫ్ లీటర్ నీటిలో 2 గ్రాములు లేదా కార్బండిజమ్ (బావిస్టిన్)లీటర్ నీటిలో 2 గ్రాములు లేదా సుడోమోనాస్ 5 గ్రాములు మరియు ట్రైకోడెర్మా 5 గ్రాములు లీటర్ నీటికి కలిపి మొక్కల మొదళ్ల తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు.

మాలలు అన్ని రంగాల్లో రాణించాలి



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం

వెల్దుర్తి(కృష్ణగిరి): మాలలు అన్ని రంగాల్లో రాణించాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు ధర్మ రాజకుమార్ పిలుపునిచ్చారు. మాలల పల్లె బాట కార్యక్రమాన్ని ఆదివారం వెల్దుర్తిలో ప్రారంభించారు. ముందుగా వెల్దుర్తి వీధుల్లో ర్యాలీ నిర్వహించి బస్టాండ్ సమీపంలోనున్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు తానే కారణమని చెప్పుకుంటున్న మందకృష్ణ మాదిగ విజయమే కాదన్నారు. పార్లమెంట్‌లో వన్‌థై థర్డ్ మెజార్టీతో వర్గీకరణ జరిగితే తప్పా..జ్యూడీషియల్ మేనేజ్ చేస్తూ చేసిన వర్గీకరణ నిలువదన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలు తిరుగుతూ మాలల్లో చైతన్యం తీసుకొస్తామన్నారు. జిల్లా అధ్యక్షుడు రమేష్‌బాబు, సీనియర్ నాయకులు వీరభద్రుడు, రామ్మోహన్, వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు లింగం శ్రీనివాసులు, డాక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

వాల్మీకి ఫెడరేషన్ చైర్మన్ పదవి వేరే వారికి ఇవ్వండి

హొళగుంద: వాల్మీకి,బోయ ఫెడరేషన్ చైర్మన్ పదవిని కప్పట్రాళ సుశీలమ్మ(బొజ్జమ్మ)కు కాకుండ వేరే వారికి ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎల్లార్తి అర్జున్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బొజ్జమ్మ స్వయంగా తానే ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తాము వాల్మీకులు కాదని చెప్పారని గుర్తు చేశారు. అలాంటి ఆమెకు పదవి ఇవ్వడం సరి కాదన్నారు.

వాల్మీకుల అభివృద్ధికి కృషి చేసిన వారికే ఆ పదవిని అప్పగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కోరారు.



పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీహెచ్ఎస్‌లో ఆనందంలో పూర్వ విద్యార్థులు

మురిసిన స్నేహం

తుగ్గలి : మండలంలోని పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీ ఉన్నత పాఠశాల 1988–93 పదో తరగతి చదువుకున్న వారందరూ ఆదే పాఠశాల వేదికగా కలుసుకున్నారు. తొలుత లోకం విడిచిన గురువులు, మిత్రులకు సంతాపంగా మౌనం పాటించారు. 36 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఆత్మీయంగా ఒకరినొకరు పలకరించుకుంటూ పాత జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. ఆ రోజుల్లో చేసిన అల్లరి పనులు గుర్తుచేసుకుని మురిసిపోయారు. ఈ సందర్భంగా పాఠాలు నేర్పిన గురువులు ఉశేన్‌సాహెబ్, గోపాల్‌కృష్ణ శర్మ, రాముడు, గంగన్నను సన్మానించారు. . పాఠశాలకు పూర్వ విద్యార్థులు ప్రింటర్, జిరాక్స్ మిషన్ అందజేశారు. పూర్వ విద్యార్థులు హెచ్‌ఎం నరేంద్ర, తిరుపాల్‌నాయుడు, చంద్రమోహన్‌రెడ్డి, శంకరరెడ్డి, దామోదరరెడ్డి, చాణక్య, చాంద్‌బాషా, నాగేంద్ర పాల్గొన్నారు.

‘అపూర్వ’ కలయిక

వెల్దుర్తి(కృష్ణగిరి): ఇరవై ఏళ్ల క్రితం వీడ్కోలు చెప్పుకున్న వారందరూ ఆదివారం కలుసుకున్నారు. ఆప్యాయంగా పలకరించుకుంటూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ సంతోషంగా గడిపారు. వెల్దుర్తి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 2003–04 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు స్థానిక పాఠశాలలో సమావేశయ్యారు. పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని నిర్ణయించారు. ముందుగా కర్నూలు నుంచి వచ్చిన నాటి తమ గురువులను డోన్ రోడ్డు నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా పాఠశాలకు తీసుకొచ్చి స్కూల్ ప్రాంగణంలో సన్మానించారు. పూర్వ విద్యార్థులు హరికృష్ణ, శ్రావణ్‌కుమార్, సుధాకర్, జాకీర్‌బాషా, కృష్ణప్రసాద్, సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.



నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

జీవితం సంతోషంగా గడపాలి



మంత్రాలయం చేరుకున్న ముత్తుకుమార్ సైకిల్‌యాత్ర

మంత్రాలయం: ప్రతి ఒక్కరూ ఉన్నదాంట్లో తృప్తిపడుతూ సంతోషంగా జీవించాలని సైకిల్ యాత్రికుడు ముత్తుకుమార్ పిలుపునిచ్చారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరు పట్టణంలోని సుబ్బన్నపాలెంకు చెందిన ముత్తుకుమార్ గత నెల 18న స్వ గ్రామం నుంచి సైకిల్ పై 4వ సారి కాశీ యాత్రకు బయలుదేరారు. ప్రయాణంలో భాగంగా తిరుమల, తిరుపతి, శ్రీకాళహస్తి, నెల్లూరు, చెన్నై,ఒంగోలు, నల్గొండ, హైదరాబాద్ మీదుగా ఆదివారం రాత్రి మంత్రాలయం చేరుకుని గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామి మూలబృందావనంకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకుని బస చేశారు. సోమవారం ఇక్కడి నుంచి బయలుదేరి హంపి, మురుడేశ్వర్, గోకర్ణ, గోవా, బాంబే, గుజరాత్, రాజస్థాన్, ఢిల్లీ, ఆగ్రా, అయోధ్య మీదుగా కాశీ క్షేత్రానికి చేరుకుంటానని ముత్తుకుమార్ తెలిపారు. తన యాత్ర దాదాపు 6 వేల కి.మీ పైగా సాగుతుందని చెప్పారు.

ఆర్థిక సాయం

ఆస్పరి: కైరుప్పల గ్రామంలో శనివారం గ్యాస్ లీకై జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధితులు పక్కీరప్ప, లక్ష్మీ కుటుంబానికి కైరుప్పల బండమీద వెంకటేశ్వర్లు సేవా సమితి స్పందించింది. ఆదివారం సమితి తరఫున రూ. 5వేలు చెక్కు, క్వింటా బియ్యం సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య అందజేశారు. సీపీఐ మండల కార్యదర్శి విరుపాక్షి, నాయకులు సుంకన్న, వీరేష్, గోపాల్, వీరభద్రి, వెంకటేష్ పాల్గొన్నారు.

మనం ఎదుగుతూ ఇతరులను ఎదగనిద్దాం

హొళగుంద: మనజాతి ఎదుగుదలకు కృషి చేస్తూ ఇతరులు ఎదిగేందుకు తమ వంతు కృషి చేద్దామని కమ్మ జన సంఘం పెద్దలు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎస్ ఆర్ ఫంక్షన్ హాల్‌లో కార్తీక వన భోజన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా తులసి, ఉసరిక చెట్టుకు పూజలు చేశారు. ఆహ్లాదకర వాతావరణంలో కలిసి మెలిసి వన భోజనం చేశారు. కుల పెద్దలు వైకుంఠం మల్లికార్జున చౌదరి, ఉమాపతినాయుడు, ఏరూరు మీనాక్షినాయుడు, మిక్కిలినేని ప్రసాద్, ఆదోని మారుతి, జోహరాపురం వెంకటేష్‌చౌదరి, చింతకుంట రామప్ప, ఆలూరు ప్రసాద్, కిరణ్, మిక్కిలినేని రమేష్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కర్నూలు(సెంట్రల్): 104 ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే చెల్లించాలని ఏపీ 104 ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.వెంకటేశ్వర్లు, ఎం.పెద్దయ్య డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఐదు నెలల నుంచి జీతాలు రాక కుటుంబసభ్యులతో కలిసి పస్తులు ఉంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో 104 ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆందోళన చేపట్టి తమ నిరసనను ప్రభుత్వానికి తెలియజేసేలా బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 104 వాహనాలను ప్రైవేట్ ద్వారా కాకుండా ప్రభుత్వమే నిర్వహించాలని, తద్వారా ఒక్కో వాహనంపై ప్రభుత్వానికి నెలకు రూ.50 వేలు మిగులుబాటు అవుతాయన్నారు. అరబిందో యాజమాన్యం చెల్లించాల్సిన పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని కోరారు. అలాగే వాహనాల ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ చెల్లించాలని, ఉద్యోగులకు పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు పాల్గొన్నారు.

శ్రీ మఠంలో కర్ణాటక మంత్రి

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు కర్ణాటక రాష్ట్రం చిన్న పరిశ్రమలశాఖ మంత్రి శరణబసప్ప కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం రాత్రి మంత్రాలయం వచ్చారు. వీరు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీరాఘవేంద్రస్వామి మూలబృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వీరిని శ్రీ మఠం అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వదించారు. అసిస్టెంట్ పీఆర్వో వ్యాసరాజాచార్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.



వన్నూరు కొట్టాల వద్ద వరి కోతలు జరుగుతున్న దృశ్యం, హొళగుంద వద్ద నిండుగా ప్రవహిస్తున్న తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) , ధాన్యాన్ని రాసిగా పోసిన దృశ్యం

మొదలైన వరి కోతలు

- రబీ సాగుకు సిద్ధమవుతున్న రైతులు
- తగ్గిన ధాన్యం ధర

హొళగుంద: తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) కింద సాగైన వరి పంటల కోతలు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది టీబీ డ్యాం నుంచి ఎల్లెల్సీకి విడుదలైన నీరు ముందుగానే డిస్ట్రిబ్యూటరీ కాలువలకు సరఫరా కావడంతో వరి పంట సాగు చేశారు. ఆ పంట ప్రస్తుతం కోతకు వచ్చింది. దీంతో మండలంలోని ఆయా సెక్షన్‌లో కోత పనులు ఊపందుకున్నాయి. గతంలో ఒకే పంట సాగు చేసిన రైతులు కొన్నేళ్లుగా రెండు పంటలు సాగు చేస్తున్నారు.. ఈ సారి కూడా రబీ పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. వరి కోతలు పూర్తవగానే..మళ్లీ వరి పంట సాగు చేయడానికే సుముఖంగా ఉన్నారు. ఇందుకు తుంగభద్ర డ్యాంలో నీరు ఆశాజనకంగా ఉండటంతో పంట సాగుకు మొగ్గు చూపుతున్నారు. డ్యాంలో నీటిమట్టం పెరగడం, వర్షాలు కురవడంతో రైతులు వరి సాగు పైనే దృష్టి పెట్టారు. దీంతో నారుకు డిమాండ్ పెరుగుతోంది. ఇప్పటికే బోరు బావుల కింద సాగైన వరి కోతలు ముగింపు దశకు చేరుకోగా.. ఎల్లెల్సీ కింద సాగైన పంటల కోతలు ఊపందుకుంటున్నాయి. మండలంలో 3,300 ఎకరాల్లో వరి సాగు అయ్యిందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నప్పటికీ అనధికారికంగా 5వేల ఎకరాల్లో పంట సాగైందని రైతులు చెబుతున్నారు.

తగ్గిన ధాన్యం ధర..

వరి పంట చేతికొస్తున్న తరుణంలో ప్రస్తుతం మార్కెట్‌లో ధాన్యం ధర తగ్గుముఖం పట్టాయి. వ్యాపారుల సిండికేట్ కావడమే ఇందుకు కారణమని రైతులు ఆరోపిస్తున్నారు. గతేడాది క్వింటా సోనా మసూరి రకం రూ.2,600 ఉండగా.. నేడు రూ.2,300, 1630 రకం ధాన్యం ధర రూ.2300 ఉండగా.. నేడు రూ.1,900, గంగా కావేరి రూ.2,300 పలుకగా ప్రస్తుతం రూ.1,800 వరకు ఆరనర్ రూ.2,600 నేడు రూ.2,200 మాత్రమే ధర పలుకుతుంది. తుంగభద్ర జలాశయంలో ప్రస్తుతం 101.226 టీఎంసీల నీరు నిల్వ ఉండటం, ఎల్లెల్సీ కాలువ నిండుగా పారుతుండటంతో రెండో పంటకు నీరు సమృద్ధిగా అందుతుందనే ధైర్యం అన్నదాతలు వరి సాగుకు సమాయత్తమవుతున్నారు.